క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణి చెప్పారు. డిసెంబర్ 1వ తేదీన ఆదివారం రావటంతో ఒకరోజు ముందుగా శనివారమే పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారమే బ్యాంకుల నుంచి పింఛన్ల పంపిణీకి నగదు డ్రా చేశారు.

అజెండా అంశాలకు ఏకగ్రీవ ఆమోదం



వినుకొండ(నూజెండ్ల): స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో పురపాలక సంఘం సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కాపురం రోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పాటు పట్టణంలో తాగునీటి సమస్య, విద్యుత్, మరుగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా అజెండాలోని అంశాలను ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కౌన్సిలర్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వెంకుపాలెం పాఠశాలలో డీఈవో తనిఖీ




వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, వినుకొండ మండలంలోని వెంకుపాలెంలో గల ఎంపీపీ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ సందర్శించారు. తరగతి గది వాతావరణం, విద్యార్థులు నేర్చుకుంటున్న ఫలితాలను గమనించి వారి పఠనం, రాత నైపుణ్యాలు, సామర్థ్యాలను పరీక్షించారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల క్లాస్ వర్క్‌బుక్‌లు, నోట్ బుక్‌లను ఆమె పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను ఆమె పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని వంట సిబ్బంది, ఆయాలకు సూచించారు. విద్యార్థుల చేతిరాత, వారి అభ్యాస ఫలితాలపై దృష్టి కేంద్రీకరించడానికి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: గణపవరం సబ్ స్టేషన్‌ల పరిధిలో ఏ ఫీడర్, హెచ్‌టీ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని చిలకలూరిపేట విద్యుత్ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.అశోక్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సినిమా హాలు రోడ్డు, ఐసీఎం కంపెనీ రోడ్డు, మువ్వావారి బజారు, గణపవరం జాతీయ రహదారి పక్క వున్న అన్ని పరిశ్రమలు, తిమ్మాపురంలోని అన్ని పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గాంధీవనం సందర్శించిన అభ్యుదయ రచయితలు



నరసరావుపేట: కడపకు చెందిన అభ్యుదయ రచయితల సంఘం జిల్లా నేతలు ఆకాశవాణి కడప కేంద్రం విశ్రాంత సంచాలకులు డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి, కడప ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సంజీవమ్మ దంపతులు శుక్రవారం స్థానిక లింగంగుంట్ల కాలనీ రోడ్ గాంధీవనంలోని గాంధీ అధ్యయన కేంద్రాన్ని సందర్శించినట్లు గాంధీవనం వ్యవస్థాపకులు ఈదర గోపీచంద్ వెల్లడించారు. అక్కడి గ్రంథాలయంలోని పలు అమెరికా, లండన్ వంటి విదేశాలలో ప్రచురితమైన అరుదైన పుస్తకాలను ఆసక్తిగా తిలకించారన్నారు. వాటిని కొన్ని గంటలపాటు అధ్యయనం చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. నరసరావుపేట మాత్రమే కాక ఇతర జిల్లాల గాంధీ తత్వ అభిమానులు, ఇతరులు తప్పక ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని గాంధీ మహాత్ముని జీవిత సందేశాలను అధ్యయనం చేసి తమ వ్యక్తిత్వాన్ని పెంపొందింప చేసుకోవాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. గాంధీ వనం ప్రతినిధులు నాగ శిరోమణి, లక్ష్మి, సుబ్బయ్య, వీరనాగయ్య, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డిపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

రొంపిచర్ల: మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం ఎంవీ రెడ్డి హస్పిటల్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 127 మందికి కంటి పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేశారు. 18 మందికి కంటి శుక్లాలు, 8 మందికి కంటి పొరలు ఉన్నట్లు గుర్తించారు. రోగ నిర్ధారణ అనంతరం అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజనాల రాజీవ్‌రెడ్డి, డీటీఏ సుమంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా భౌభౌలే!

- సంతగుడిపాడులో చిన్నా- పెద్దా ఎవ్వరినీ విడిచిపెట్టకుండా దాడి చేస్తున్న కుక్కలు
- చేసేది లేక కర్రలు చేతపట్టుకుని సంచరిస్తున్న గ్రామస్తులు
- 40 మందిని కరిచినా చలనం లేని యంత్రాంగం



సంతగుడిపాడు గ్రామంలో గుంపుగా తిరుగుతున్న కుక్కల మంద

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. ఈ గ్రామంలో ఎక్కడ చూసినా ఐదు నుంచి పదిహేను కుక్కల వరకు గుంపులు గుంపులుగా చేరి తిరుగుతున్నాయి. ఉదయం పిల్లలను పాఠశాలలో వదిలిపెట్టేందుకు వచ్చిన పెద్ద వారిపై, పిల్లలపై దాడి చేస్తున్నాయి. గ్రామస్తులకు పిల్లలను జాగ్రత్తగా బడికి పంపటం, తిరిగి దగ్గర ఉండి ఇంటికి తీసుకొచ్చుకోవాల్సిన పరిస్థితి తల్లిదండ్రుల్లో నెలకొంది. ఈ పరిస్థితుల్లో రాత్రి వేళల్లో బయటకు రావాలంటే గడగడలాడుతున్నారు. యుద్ధానికి వెళ్తున్నట్లుగా పెద్ద పెద్ద బడితెలు, కర్రలతో రావాల్సిన పరిస్థితి గ్రామస్తులలో నెలకొంది.

ఈ పరిస్థితి ముస్లిం కాలనీలో మరీ తీవ్రంగా ఉన్నట్లు కాలనీ వాసులు తెలిపారు. శుక్రవారం గ్రామానికి చెందిన సైదా, మాబ్లుతో పాటు మరో మహిళపై దాడి చేసి గాయపరిచాయి. ఈ ఏడాది ఈ గ్రామంలో కుక్క గాటుకు గురైన వారి సంఖ్య 40 మంది వరకు ఉంటుందని గ్రామస్తులు వెల్లడించారు.

కుక్కలు గాయపరచటమే కాకుండా వాటిని ఎదుర్కోలేని, పరుగులు తీయలేని వృద్ధులనైతే తీవ్రంగా పట్టి పీకుతున్నాయి. కుక్కకాటుకు గురైతే కేవలం ప్రథమ చికిత్స చేసి విషం వ్యాప్తి చేందకుండా రాబిస్ ఇంజక్షన్లు ఇస్తారు. ఈ గ్రామంలో కుక్కల దాడుల్లో గురై తీవ్రంగా గాయాలైన పలువురు వైద్యశాల్లో చేరి మెరుగైన చికిత్సలు తీసుకొని వేల రూపాయల బిల్లులు కూడా చెల్లించారు. పెద్దవారు కాకుండా సంవత్సరం రెండేళ్ల వయస్సు ఉన్న పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వస్తే కుక్కలు చిన్నారులను నోట బట్టుకొని ఎత్తుకెళ్లే పరిస్థితులు గ్రామంలో నెలకొన్నాయని గ్రామస్తులు వెల్లడించారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల బెడద నుంచి సంతగుడిపాడు గ్రామస్తులను రక్షించాలని కోరుతున్నారు.

మూగజీవి కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు

గొర్రెకు ఆపరేషన్ చేసి కేజీన్నర వ్యర్థాలను తీసిన డాక్టర్



రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు గొర్రె పొట్ట నుంచి కిలోన్నర ప్లాస్టిక్ వ్యర్థాలను శుక్రవారం పశువైద్యులు డాక్టర్ సాయి మహేష్ రెడ్డి ఆపరేషన్ చేసి బయటకు తీశారు. ఆరేపల్లి గ్రామానికి చెందిన మిరపెల్లి వెంకటేశ్వర్లుకు చెందిన గొర్రె వారం రోజులుగా మేత తినడం లేదు. గొర్రెకు మందులు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేక గొర్రె బ్రతకదని ఆశలు వదిలేశాడు. గొర్రె మల ద్వారం గుండా వెళ్లాల్సిన కసరు నోటి నుండి ముక్కు నుండి బయటకు రావటం మొదలైంది. యజమాని గొర్రెను పశువైద్యులు డాక్టర్ సాయి మహేష్‌రెడ్డికి చూపించారు. గొర్రెకు పరీక్షలు నిర్వహించి కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గొర్రెకు రుమెనోటమీ ఆపరేషన్ చేశారు. పొట్టలో ఉన్న కేజీన్నర వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను బయటకు తీశారు. అవసరమైన మందులను ఇచ్చి గొర్రె ప్రాణాలు కాపాడారు. గొర్రె ప్రాణాలను కాపాడిన డాక్టర్‌ని యజమాని వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఇటీవల కాలంలోని గురజాల మండలం మాడుగులలో గేదె కడుపు నుంచి 2 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించగా, గత శనివారం కర్లకుంటలోని ఓ ఆవు పొట్ట నుంచి 6 కేజీల వ్యర్థాలను తీశారు. నేడు ఆరేపల్లి గ్రామానికి చెందిన ఓ గొర్రె పొట్ట నుంచి ఒకటిన్నర కేజీల ప్లాస్టిక్ ముక్కలను తొలగించి మూగజీవాల ప్రాణాలను కాపాడారు.

ప్లాస్టిక్‌తో మూగజీవాలకు ప్రాణాంతకం

ఈ సందర్భంగా పశువైద్యులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం, వ్యర్థాల సరైన నిర్వహణ లేకపోవడం వల్ల మూగజీవాలకు ప్లాస్టిక్ ప్రాణాంతకంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో మూగ జీవాల రక్షణ కోసం ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. దయచేసి ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, వ్యర్థాలను ఎక్కడా పడవేయకుండా వాటిని నాశనం చేయాలని సూచించారు. అప్పుడే పర్యావరణ సమతుల్యం, మూగజీవాలకు పొంచి ఉన్న ప్రాణముప్పు తొలుగుతుందన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న రంగనాయకులు, కంపెనీ ప్రతినిధులు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 108 మంది అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరయ్యారు. మాస్టర్ మైండ్స్, రుద్ర కార్పొరేట్ సర్వీసెస్, సింధుజ మైక్రో క్రెడిట్, కపిస్టన్ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 70 మందిని ఎంపిక చేశారు. ఆయా కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతీ యువకులు జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొంది జీవితంలో చక్కగా స్థిరపడాలన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ చుండి రంగనాయకులు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్యతో కలిసి కంపెనీ హెచ్‌వోడీలు నియామక పత్రాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా చుండి రంగనాయకులు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో మంచి ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ జేఈవో రమాదేవి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి రవీంద్ర, ఏడీఎస్‌డీఈ రామాంజనేయులు, చిలకలూరిపేట స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జె.సురేష్, అంజిరెడ్డి, రమ్య పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

వితంరాజుపల్లిలో విద్యార్థుల ర్యాలీ



వినుకొండ(నూజెండ్ల): ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా వినుకొండ మండలంలోని వితంరాజుపల్లి గ్రామపంచాయతీ నందు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీలో చెత్త రోడ్లపై వేయకండి, డ్రైనేజీల్లో చెత్త నింపకండి, ఆరోగ్యం మన అందరి బాధ్యత అని, ఇంటింటా మరుగుదొడ్డి ఊరంతా ఆరోగ్యం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, గ్రామసర్పంచ్ పెనుమాల సుమలత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలేశ్వరనాయక్, హెచ్‌ఎం పి. వెంకటరత్నమ్మ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండలో గేదెలు, పొట్టేళ్లు అపహరణ

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో గేదెలు, పొట్టేళ్ల దొంగలు పెరిగిపోతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినుకొండ మండలంలోని ఉమ్మడివరంగ్రామంలో పలువురు రైతులకు చెందిన పొట్టేళ్లు, గేదెలు అపహరణకు గురైనట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో గేదెలు, పొట్టేళ్లను దొంగలించుకుపోయే వారి పట్టుకొని తమ జీవాలు తమకు ఇప్పించాలని వారు వేడుకున్నారు. దొంగలను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

చిలకలూరిపేట టౌన్: తల్లిదండ్రులు, గురువులు సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఎంఈఓ కె.లక్ష్మి తెలిపారు. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం బాల్య వివాహ రహిత ముక్త్ భారత్ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీతోపాటు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శాంతకుమారి, సూపర్‌వైజర్లు ఎస్.భాగ్యలక్ష్మి, ఆర్.సామ్రాజ్యం బాలల హక్కులు, చట్టాలు, అక్రమ తరలింపు, వాటి నిరోధం, తదితర అంశాలపై ప్రసంగించారు.

విద్యుత్ సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం

ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ రాంభొట్లు



బండ్లమోటు సబ్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఈఈ, డీఈఈ, ఇతర అధికారులు

బొల్లాపల్లి: మండలంలోని బండ్లమోటు, మూగచింతలపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. రాంభొట్లు శుక్రవారం తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌ల, రికార్డులను పరిశీలించారు. రైతులకు వ్యవసాయానికి సంబంధించి సరఫరాలో అంతరాయం ఉన్నందున త్వరలో పరిష్కరిస్తామన్నారు. మూగచింతలపాలెం సబ్ స్టేషన్‌లో మరో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్) ఏర్పాటు చేస్తున్నామని, గుట్లపల్లి నుంచి వెల్లటూరు సబ్ స్టేషన్ వరకు నూతన కరెంటు లైన్ నిర్మాణంలో ఉందన్నారు. రెండు నెలల్లో కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. శ్రీనివాసరావు, ఏఈఈ వి.వెంకట్రావు, సబ్ ఇంజనీర్ బి. రామాంజనేయులు నాయక్ తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు పారిశ్రామిక సందర్శన

మోడల్ స్కూల్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన



పారిశ్రామిక సందర్శనలో పాల్గొన్న మోడల్ స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం మోడల్ స్కూల్ కళాశాల విద్యార్థులు శుక్రవారం నరసరావుపేటలో పారిశ్రామిక సందర్శన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి. రవి నాయక్ మాట్లాడుతూ పారిశ్రామిక సందర్శన అనేది బోధనలో అత్యంత వ్యూహాత్మక పరస్పర చర్యలతో కూడిన పద్ధతి అన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలను చదివి అవగాహన చేసుకున్న విషయాలను వెలుపల ఆచరణాత్మకంగా చూసి తెలుసుకునే కార్యక్రమం అన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ సందర్శనలో పాల్గొని ఎన్నో విషయాలను స్వయంగా చూసి అవగాహన చేసుకున్నారు. యంత్ర పరికరాల కదలికలను చూసి విద్యార్థులు ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ అధ్యాపకులు ఎన్. తిరుమల, బి.నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిషన్ నియమించాలి

నోబుల్ టీచర్స్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బెజవాడ నాగేశ్వరరావు



నోబుల్ టీచర్స్ క్యాలెండరు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బెజవాడ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో నోబుల్ టీచర్స్ నూతన క్యాలెండరు అవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అనవసరపు యాప్స్ రద్దు చేయాలని, అపార్ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలన్నారు. తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయులకు పేరుకుపోయిన పెండింగ్ బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, 11వ పీఆర్సీ బకాయిలు 90 నెలల పెండింగ్ డీఏలను ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్నారు. గత ఆరు నెలలుగా ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు కోట్ల రూపాయలలో పేరుకుపోయానని వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్పొరేషన్, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా రేషనలైజేషన్ చేసి నూతన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేసి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజు 62 యాప్స్‌తో పాఠశాల తరగతుల ప్రారంభంలో మొదట పీరియడ్ మొత్తం బోధన లేకుండా పోయిందని వెంటనే అనవసర యాప్స్ రద్దు చేయాలన్నారు.

మండల విద్యాశాఖాధికారి పోస్టులను భర్తీ చేయాలన్నారు. గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మిస్సింగ్ క్రెడిట్స్ క్లియర్ చేయకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల పదవీ విరమణ అనంతరం చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరగటంతో పాటు మిస్ అయిన అమౌంటు వేలలో కోల్పోవడం జరుగుతుందన్నారు. జెడ్పీ కార్యాలయ పీఎఫ్ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాఠశాలలో పాత విధానంలోనే సమయంలోనే కొనసాగించాలన్నారు. ప్రతినెలా 1వ తేదీన ఉపాధ్యాయులందరికీ జీతాలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమ పోరాటాలు ఆందోళనలు తప్ప మరొక మార్గం లేదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.సాంబశివరావు, ఎంఎస్ రావు, కార్యవర్గ సభ్యులు గద్దె రామకోటేశ్వరరావు, మురుగొండ శ్రీనివాసరావు, జాకీర్ హుస్సేన్, చేపూరి రమేష్, ఉన్నారు.

బుచ్చిబాపన్నపాలెం పర్యటించిన గోపిరెడ్డి



అయ్యప్ప మాలధారులతో డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలోమాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి శబరిమలై యాత్రకు బయలు దేరుతున్న స్వాముల ఇరుముడి పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వాములందరినీ అభినందించి సుఖవంతమైన యాత్ర కొనసాగించాలని ఆకాక్షించారు. వీరి వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కురుగుంట శ్రీనివాసరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్ర బాబు, బీరం భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాను గోటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గాల ఎంపిక



యడ్ల చిట్టిబాబు



చెన్నకేశవరావు



కందా స్నేహలత



ఎస్‌కేఎండీ యాసిన్

చిలకలూరిపేట: విద్య ప్రభుత్వ రంగంలో ఉంటేనే సమాజంలోని బడుగు బలహీనవర్గాలకు అందుబాటులో ఉంటుందని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ సభను పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు యూటీఎఫ్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. అనంతరం యూటీఎఫ్ పట్టణ, మండల శాఖల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా యడ్ల చిట్టిబాబు, అంబటి చెన్నకేశవరావు, గౌరవ అధ్యక్షుడిగా తంగెళ్ల సుధాకర హరిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా దాసరి వెంకట కృష్ణబాబు, కె ఆదిలక్ష్మి, కోశాధికారిగా బిట్రా నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. చిలకలూరిపేట మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా కందా స్నేహలత, ఎస్‌కేఎండీ యాసిన్, గౌరవ అధ్యక్షుడిగా వి.నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎం ఉమామహేశ్వరరావు, ఇంటూరు సునీత, కోశాధికారిగా డి.యేసన్న నాయక్‌లను ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె తిరుపతి స్వామి వ్యవహరించారు.

సంక్షిప్త వార్తలు

■ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట: పట్టణ శివారు గుంటగార్లపాడులోని సర్వే నెంబర్ 75/3, 75/4లో ఉన్న వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన పీర్లమాన్యం భూమిని కబ్జాచేసిన భూబకాసురులపై చర్యలు తీసుకోవాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వక్ఫ్‌బోర్డులోని కింది స్థాయి అధికారులతో కుమ్మక్కై కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కబ్జాచేసి ప్లాట్లుగా మారుస్తున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. ఆ స్థలానికి కనీసం వక్ఫ్‌బోర్డు స్థలమంటూ బోర్డు ఏర్పాటుచేయకపోవటం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న వక్ఫ్ స్థలాలను గుర్తించి కబ్జాకు గురికాకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మౌలాలి కోరారు.

■ సర్వే సమర్థంగా నిర్వహించాలి

నాదెండ్ల: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డిసెంబర్ 4న జరిగే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా మాస్టర్ ట్రైనర్, గణపవరం జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం కృష్ణానాయక్ చెప్పారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఎంపికైన 18 పాఠశాలల్లో 3,6,9 తరగతుల్లో నిర్వహించే సర్వేలో సీఆర్ కళాశాల విద్యార్థులు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో శుక్రవారం ఫీల్డ్ ఇన్విజిలేటర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం కృష్ణానాయక్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ కార్యక్రమం జరగనున్నందున లక్ష్యాలను సాధించే విధంగా పనిచేయాలన్నారు.

■ ఎయిడ్స్ చట్టంపై అవగాహన సదస్సు

నరసరావుపేట ఈస్ట్: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ఆదరణ కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. వరల్డ్ ఎయిడ్స్‌డే-2024 సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ ప్రివెన్షన్, కంట్రోల్ యాక్ట్ 2007 పై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ అమూల్య, న్యాయవాది చంద్రశేఖర్‌లు చట్టంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు గల హక్కులు, సమానత్వాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్, ఆర్‌ఎంఓ డాక్టర్ ఏడుకొండలు, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ డైరెక్టర్ ఆనంద్‌బెంజమెన్, సీఎస్సీ 2.0 పీసీ మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

■ ఘనంగా కార్తిక వనసమారాధన

రొంపిచర్ల: స్థానిక శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శంకర స్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావు, మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎనాలుగు వేల మందికి అన్నదాన కార్యక్రమం జరిగింది.

■ యాజమాన్య పద్ధతులు పాటించాలి

వినుకొండ(నూజెండ్ల): సమగ్ర ఎరువుల యాజమాన్యంతో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం పల్నాడు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.శివకుమారి అన్నారు. నూజెండ్ల మండలంలోని కంభంపాడు, పమిడిపాడు గ్రామాల్లో రైతుల ఫిర్యాదు మేరకు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి వరి, కంది పంటలను పరిశీలించారు.

■ 2 నుంచి ఉచిత యోగ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగసేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 2వతేది నుంచి 182వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు శాఖ నిర్వాహకుడు కూనిశెట్టి వెంకటజనార్ధన్‌గురూజీ శుక్రవారం తెలిపారు. శ్రీపట్టాభిరామస్వామి ఆలయ ప్రాంగణంలోని వేంకటేశ్వర కళ్యాణ మండపంలో ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7గంటల వరకు 28 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వివరించారు.

■ ఘనంగా మాసశివరాత్రి వేడుకలు

శావల్యాపురం: కార్తికమాసం సందర్భంగా మాస శివరాత్రి పురస్కరించుకొని శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీకనక దుర్గమ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో శివలింగ ఆకారంలో మట్టి ప్రమిదల్లో ఆవునెయ్యి పోసి వత్తులు వేసి దీపాలను మహిళలు అయ్యప్ప మాలధారణ భక్తులు శుక్రవారం సాయంత్రం వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రెడ్డి జ్వాల నరసింహారావు, పద్మనాభుని హనుమంతరావు, దావులూరి బ్రహ్మయ్య, గట్టుపల్లి సత్యనారాయణ, వీరాంజినేయులు, సనిశెట్టి గురువీరాంజినేయులు, జక్కా నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.